
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025



జేఎన్‌టీయూ వీసీ నేడు బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):జేఎన్‌టీయూ (గురజాడ) విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏడాది కాలంగా ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అదే కళాశాలలో సీనియర్ అధ్యాపకురాలిగా ఉన్నారు. తాజాగా వీవీ సుబ్బారావును నియమిస్తూ గవర్నర్ నజీర్ ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రొఫెసర్ సుబ్బారావు కాకినాడ జేఎన్‌టీయులో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చూస్తున్నారు.



ఎక్కడికక్కడే మోసం

- తూనికల్లో హెచ్చుతగ్గులు
- లోపభూయిష్టంగా యంత్రాలు
- సరుకుల నాణ్యత అంతంతమాత్రమే
- అనుమతులూ సందేహమే
- ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి తీసుకోని వాటర్ ప్లాంట్లు

● శృంగవరపుకోట పట్టణంలోని రెండు వాటర్ ప్లాంట్లను మూడురోజుల కిందట జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి నాగూల్‌మీరా తనిఖీ చేశారు. వాటికి ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) అనుమతులు లేవు. కనీసం వీటిని పొందాలన్న విషయం కూడా ఆ ప్లాంట్ల యజమానులకు తెలియదు. అనుమతుల కోసం ఎక్కడ, ఎలా దరఖాస్తు చేసుకోవాలో చెప్పాలంటూ తనిఖీ అధికారినే అడగడం విశేషం. వీరికే కాదు జిల్లాలో వాటర్ ప్లాంట్లు నడుపుతున్న అత్యధిక శాతం యజమానులది ఇదే పరిస్థితి. ఈ విషయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారే ధ్రువీకరించారు. అదే రోజు వారు మరో దుకాణంలో పామాయిల్‌ను పరిశీలించారు. డబ్బాల్లో పోసిన పామాయిల్‌పై నురుగ, దుమ్ము కనిపించడంతో అనుమానం వచ్చి శాంపిల్‌ను సేకరించారు.


ఎస్.కోటలో వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారి నాగూల్ మీరా(ఫైల్)

● గత నెల 29న శృంగవరపుకోట పట్టణంలో తోపుడు బళ్లపై పండ్లను విక్రయిస్తున్న వారిని జిల్లా తూనికలు కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి పరిశీలించారు. కిలో పండ్లకు 700 నుంచి 800 గ్రాములు తూకవ వేసి ఇస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ చేసిన ఐదు తోపుడు బండ్ల వద్ద ఇదే పరిస్థితి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు.

శృంగవరపుకోట, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు విక్రయించేవారిపై ఏ శాఖ అధికారులు దాడులు చేసినా అనేక లోపాలు బట్టబయలవుతున్నాయి. తూనికలు, కొలతల్లో మోసంతో పాటు నాణ్యత లేని సరుకులను విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నారు. కిరాణా, పండ్లు, మాంసం, చేపల దుకాణాల్లో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా తూకంలో మోసం చేస్తున్నారు. కేజీ మాంసం తీసుకుంటే కనీసం పది గ్రాములైనా తక్కువ ఉంటోంది. చేపలైతే కాటాలో తూస్తున్నప్పుడే మోసం చేస్తున్నారు. కేజీ చేప కొనుగోలు చేస్తే దాన్ని మాంసంగా తయారు చేసేటప్పటికి అర కేజీ కూడా ఉండడం లేదు. అడిగితే బుర్ర, పొలుసు, ఇతర పోట్లు తీసేస్తే ఇంకెంతస్తుందన్న సమాధానం వినిపిస్తోంది. ఇవి చూసేందుకు దుకాణాలు చిన్నవిగా ఉన్నప్పటికీ ఇక్కడ జరుగుతున్న మోసం అంతా ఇంత కాదు. వీరి వద్దనున్న కేజీ, అరకేజీ గుండ్లుకు సీళ్ల ఉండవు. కాటా వారికి అనుగుణంగానే తయారు చేయించుకుంటు న్నారు. సాధారణ కాటా, ఎలక్ట్రికల్ కాటా అయినా ఇంతే. ఏడాదికో, రెండేళ్లకో అధికారులు దాడులు చేస్తుంటారు. అంతలోనే ఆ విషయం అందరికీ తెలిసి దుకాణాలన్నీ మూతబడతాయి. తనిఖీ అధికారులు (మిగతా 8వ పేజీలో..)



ఆ ఊరు నుంచి పది మంది టీచర్లు

- కొలువులో చేరేందుకు ఉత్సాహంతో సన్నద్ధం


ఉపాధ్యాయ కొలువులు సాధించిన పెదమేడపల్లి వాసులు

మెంటాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : పెదమేడపల్లి గ్రామం మరోసారి వార్తల్లో నిలిచింది. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఈ గ్రామం నుంచి ఏకంగా పదిమంది ఎంపికయ్యారు. వీరంతా ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసుకున్నారు. తొమ్మిది మంది విజయనగరంలో ఒకరు విశాఖలో ఇటీవల ఉపాధ్యాయ శిక్షణ పొంది కొలువుల్లో చేరేందుకు సన్నద్ధమయ్యారు. వీరిలో ఆర్.కృష్ణ(పీఈటీ), బి.గోపీ(ఎస్ఏసోషల్), ఇ.సత్యనారాయణ(ఎస్జీటీ), ఆర్.చంటి(ఎస్జీటీ), బి.బంగార్రాజు(ఎస్ఏ మ్యాథ్స్), కె.నాగరాజు(ఎస్ఏ సోషల్), కె.గౌరిమణి(టీజీటీ మ్యాథ్స్), వి.లావణ్య(ఎస్జీటీ), వి.షర్మిల(ఎస్జీటీ), బి.కల్యాణి(ఎస్ఏపీఎస్)ఉన్నారు. ఒకే గ్రామం నుంచి పదిమంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవడం మెంటాడ మండల చరిత్రలో ఇదే ప్రథమంగా చెబుతున్నారు. ఎంపికైన వారంతా విధుల్లో చేరేందుకు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు. ఈ పదిమంది తల్లిదండ్రులు పేద,మధ్యతరగతి వారే. పిల్లలు ఉపాధ్యాయ ఉద్యోగాల్లో చేరబోతున్నవేళ వారు ఉద్వేగానికి లోనవుతున్నారు.

సహ ఉపాధ్యాయులుగా తండ్రీకొడుకు

- ఒకే పాఠశాలలో విధులు
- ఇద్దరూ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్లే


తండ్రి రామకృష్ణ, తనయుడు రాకేష్

బొబ్బిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తండ్రీ కొడుకు ఇద్దరూ ఒకే పాఠశాలలో ఒకే సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయులుగా అవకాశం లభించిన అరుదైన ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక పూల్‌బాగ్‌కు చెందిన బంకురు రాకేష్ ఇటీవల జరిగిన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయునిగా ఎంపికై ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించారు. ఈయన బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి వేణుగోపాల స్వామి మున్సిపల్ హైస్కూలులో నియామకమయ్యారు. సోమవారం విధుల్లో చేరనున్నారు. అదే పాఠశాలలో తండ్రి రామకృష్ణ కూడా ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండడం విశేషం. ఇకపై తండ్రీకొడుకు ఒకే పాఠశాలలో ఒకే సబ్జెక్టు టీచర్లుగా పనిచేయనున్నారు. అరుదుగా లభించిన ఈ అవకాశం పట్ల రాకేష్ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏయూలో ఎంఏ లిటరేచర్ చేసి బీఈడీ చదివిన రాకేష్ మొదటి సారి డీఎస్సీ రాసి రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకును సాధించారు.

రేపు పైడిమాంబ తెప్పోత్సవం

- నేడు ట్రయల్ రన్



విజయనగరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ సిరిమానోత్సవ ప్రక్రియలో భాగంగా ఈ నెల 14న తెప్పోత్సవం జరగనుంది. దేవదాయశాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీతో పాటు పలు శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి వెనుక భాగాన ఉన్న పెద్దచెరువులో ఈ తంతు జరుగనుంది. తొలుత వనంగుడి నుంచి పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లనున్నారు. అంతకముందు వేద పండితుల సదస్సు కూడా పైడిమాంబ ఆలయంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పైడిమాంబ తెప్పోత్సవం మంగళవారం జరగనుండగా సోమవారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు.



పసిడి పైపైకి!



- గ్రాము రూ.12 వేలకు పైనే
- పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లలో మరింత అధికంగా పెరుగుదల
- సామాన్యులకు అందని ద్రాక్షగా బంగారం



విజయనగరం/ రాజాం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పసిడి ధర పరుగెడుతోంది. తారాజువ్వలా ఆకాశాన్ని తాకుతోంది. గంట గంటకూ ధరలో వ్యత్యాసం కనిపిస్తోంది. పది గ్రాముల బిస్కెట్ బంగారం లక్ష దాటింది. బులియన్ మార్కెట్‌లో కొన్నాళ్లగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం పెళ్లిల్లు, పండుగల సీజన్ కావడంతో ధర కొండెక్కి కూచుంది. దీంతో ధర ఏమాత్రం తగ్గినా కొందామని ఆశిస్తున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు బంగారం అందని ద్రాక్షగా మారింది. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య నెలకొన్న యుద్ధం కూడా పసిడి ధర అమాంతం పెరిగేందుకు ఓ కారణమంటూ హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ధర పెరుగుతుండడంతో అత్యవసరమైతే తప్ప బంగారం కొనేందుకు అంతగా శ్రద్ధ చూపడం లేదంటున్నారు. అయితే ఆర్థికంగా స్థితిమంతులు, బంగారం పెట్టుబడిగా ఉపయోగించేవారు మాత్రం యథావిధిగా వారివారి స్థాయిని బట్టి బంగారాన్ని కొంటున్నారు.

రూ.12 వేలు దాటిన గ్రాము బంగారం..

జిల్లాలో పేరెన్నిక గన్న షోరూంలతో పాటు చిన్నా, పెద్దా కలిపి 500కి పైగా బంగారం షాపులున్నాయి. ప్రముఖ సంస్థలు ప్రకటించిన ప్రకారం శనివారం నాటి ధరలను పరిశీలిస్తే 24 కేరెట్ల బంగారం గ్రాము ధర రూ.12,424 ఉంది. 22 కేరెట్ల ధర రూ.11,389 వద్ద స్థిరంగా ఉంది. ఈలెక్కన 24 కేరెట్లు పది గ్రాములు రూ.1,24, 240 కాగా 22 కేరెట్ల ధర రూ.1,13,890 పలుకుతోంది. కాగా చిన్న, మధ్యతరహా స్థాయి షాపుల్లో కూడా బంగారం ధరలు కాస్త అటుఇటులో ఉన్నాయి. ఈలెక్కన 24 కేరెట్ల తులం బంగారం (11.66 గ్రాములు) సుమారు రూ.1.50 లక్షల వద్ద ఉంది. ఇదే ధర 22 కేరెట్లు పరిశీలిస్తే రూ.1.33 లక్షలు పలుకుతోంది. ఇదిలా ఉంటే ఆర్నమెంట్ విషయానికొస్తే ఈ ధరలు మరింతగా పెరిగే పరిస్థితి ఉంది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాల్సి వస్తే బంగారం బరువుతో పాటు తయారీ చార్జీలు, కేడీఎం ధర అదనంగా చేరనున్నాయి. ఈలెక్కన 24 కేరెట్ల తులం బంగారం దాదాపు రూ.1.50 లక్షలు వరకూ ఉండే పరిస్థితి ఉంది.

నకిలీ హాల్‌మార్కు..

కొందరు వ్యాపారులు ప్రత్యేకంగా తయారుచేసిన మిషన్లతో నకిలీ హాల్‌మార్కు వేసి బంగారం విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ నకిలీ (మిగతా 8వ పేజీలో..)


రాజాంలో రద్దీలేని ఓ షోరూం


గతంలో నడిచిన బొబ్బిలి- సాలూరు రైలు బస్సు

ట్రయల్ రన్‌తో సరి!

- రైలు బస్సు స్థానంలో రైలేదీ?
- సాలూరు-విశాఖ వయా బొబ్బిలి ప్యాసింజరు రైలు ఎప్పటికో
- నిరాశలో ప్రయాణికులు

బొబ్బిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి)

బొబ్బిలి, సాలూరు ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణికులు ప్యాసింజరు రైలుపై పెట్టుకున్న ఆశలు ఇప్పట్లో నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విశాఖపట్నానికి ప్రవేశపెట్టనున్న ప్యాసింజరు రైలుకు గత ఏడాది ఇదే నెలలో ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖలో ఉదయం 10 గంటలకు బయలుదేరి బొబ్బిలికి మధ్యాహ్నం 12.30కి, సాలూరుకు 1.10 గంటలకు చేరుకుంటుందని, తిరిగి సాలూరు నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు విశాఖ చేరుకుంటుందని అప్పట్లో అధికారులు ప్రకటించారు. నేటికీ ఆచరణ మాత్రం లేదు. రైలు బస్సు స్థానంలో పూర్తిస్థాయి రైలు ఎప్పుడనేది ఎవరూ చెప్పలేకపోతున్నారు.

బొబ్బిలి, సాలూరు ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న సంగతి తెలిసిందే. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికుల అవసరాలను ప్రస్తుత రైళ్లు తీర్చలేకపోతున్నాయని, ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రయాణీకులకు సాధారణ బోగీలు సరిపడా లేక నానా అవస్థలు పడుతుండడంతో అదనపు బోగీలతో కూడిన ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేయాలని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు అనేక సంవత్సరాలుగా కోరుతున్నాయి. కాగా బొబ్బిలి-సాలూరు మధ్య నడిచే రైలు బస్సును కరోనా కాలం నుంచి పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఈ రెండు పట్టణాల మధ్యనున్న గ్రామాల ప్రజలు (మిగతా 8వ పేజీలో..)


గత ఏడాది ప్రారంభోత్సవ సమయంలో బొబ్బిలి చేరుకున్న సాలూరు-విశాఖ పాసింజర్ రైలు

గూగుల్ రాకతో ఉపాధి అవకాశాలు

● ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గూగుల్ కంపెనీ విశాఖపట్టణం రావడంతో ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేశ్‌ల కృషి వల్ల గూగుల్ కంపెనీ రాష్ట్రానికి తరలివచ్చిందని పేర్కొన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటు కావడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తుందని పేర్కొన్నారు.

డేటా సెంటర్లతో యువతకు ఉపాధి

చీపురుపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఏఐ ఆధారిత డేటా సెంటర్లతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. ఇటువంటి అవకాశాన్ని ఉత్తరాంధ్ర జిల్లాలకు కల్పించినందుకు ఆయన మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ వచ్చిన రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్‌ను ఆయన ఆదివారం విశాఖపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. డీసీసీబీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున కూడా మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ అంశాలపై మాట్లాడారు. కేంద్ర సహకార బ్యాంకు కార్యకలాపాలపై చర్చించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కార్యక్రమం నిర్వహిస్తామని, అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

రాకేశ్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలి

రాజాం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన రాకేశ్‌కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.సురేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే చెప్పు విసరటం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.త్రినాథ్, రము, శ్రీను, రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

నెల్లిమర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ గణేష్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు విక్రయాలు ఇళ్లల్లో పెట్టవద్దని సూచించారు. తాత్కాలిక లైసెన్సు తీసుకున్నప్పటికీ మూడు రోజుల ముందు మాత్రమే బాణసంచా విక్రయించాలని, అక్రమంగా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి

గుర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు మత్తు పానియాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నారాయణరావు అన్నారు. ఆదివారం సాయంత్రం చింతలపేట గ్రామంలో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనవసరమైన తగవులకు పోయి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. అలాగే డ్రగ్స్, గంజాయి వంటివి వినియోగించినా, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష తులసి పూజలకు తరలిరండి

విజయనగరం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని తోటపాలెంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని నవంబరు 1 నుంచి 5వ తేదీ వరకూ స్వామివారికి లక్షతులసీ పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ సూర్యభగవాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రధాన అర్చకులు పణిహారం రంగాచార్యులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడుపుతున్నారు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం నకిలీ మద్యం ఫ్యాక్టరీలను నడుపుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అక్రమ సంపాదన కోసం టీడీపీ ఈ నకిలీ మద్యం తయారీకి తలుపులు తెరిచిందన్నారు. అసలు మద్యం బాటిల్స్‌ను పోలినట్లుగా తయారీ చేయడం వెనుక అధికార పెద్దల హస్తం ఉందన్నారు. జయచంద్ర అనే వ్యక్తి కోవర్టు అంటే ఆయనకు టికెట్ ఎలా ఇచ్చారో టీడీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బాబోయ్ కుక్కలు

● గుంపులు గుంపులుగా సంచారం
● వాహనచోదకులు, పాదచారులపై దాడి చేస్తున్నవైనం



ముకుందపురంలో సంచరిస్తున్న కుక్కలు

సంతకవిటి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరుగుపోతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనచోదకులు, పాదచారులపై దాడి చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు వీధిల్లోకి రావాలంటేనే భయపడుతున్నారు. రాజాం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో రోజురోజుకూ కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి రోజూ 15 నుంచి 20 కేసులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాలుగు మండలాల్లో ప్రభుత్వ దవాఖానాకు ప్రతి నెల 10 నుంచి 30మంది కుక్కకాటు బాధితులు వస్తున్నారని అన్నారు. రెండు నెలల కిందట రేగిడి మండలం అంబఖండిలో ఒక్క రోజే 14 మందిపై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. అది మరువక ముందే తాజాగా సంతకవిటి మండలంలోని మోదుగులపేట గ్రామంలో ఆగస్టు నెలలో నలుగురిపై పిచ్చికుక్క దాడి చేసింది. అదే నెలలో గోవిందపురంలో ముగ్గురిపై దాడి చేసింది. ఇందులో అదపాక లింగంనాయుడు అనే వ్యక్తి రాబీస్ వ్యాధికి గురై ఇటీవల మృతి చెందారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కుక్క కాటు బాధితులకు ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉంచాం. 24 గంటలూ వైద్య సేవలను అందిస్తున్నాం. ఇప్పటికే చాలా మందికి కుక్కకాటు టీకాలు వేశాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. - నాగేంద్రప్రసాద్, వైద్యుడు, సంతకవిటి పీహెచ్‌సీ

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గంలో టీడీపీ పటిష్టానికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ విజయనగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పార్టీ నియమావళి ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. ఈక్రమంలో టీడీపీ విజయనగరం నగరం, మండలం ప్రధాన కమిటీలతో పాటు, అనుబంధ సంఘాలకు కూడా కమిటీలు నియమించారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. టీడీపీ నగర, మండల అధ్యక్షులుగా ఎంపికైన గంటా రవి, గంటా పోలినాయుడులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు గ్రామ, డివిజన్, మండల, నగర, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. టీడీపీ నగర, మండల కమిటీలతో పాటు, పది అనుబంధ సంఘాలకు కూడా కమిటీలను నియమించారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే తోపాటు పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నేడు జీపీ అప్పారావు విగ్రహావిష్కరణ

గంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన జీపీ అప్పారావు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నారు. ఈ పనులను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. విగ్రహావిష్కరణకు ప్రజా ప్రతినిధులు వస్తారని, అన్ని ఏర్పాట్లు చక్కగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి ఆయకట్టు ఛైర్మన్ జగన్నాథం, టీడీపీ నాయకుడు కొండపల్లి కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయకుమార్, పార్టీ నాయకులు రంధి అర్జున మహేశ్వరరావు, రవి, కిలపర్తి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగర తెలుగు యువత అధ్యక్షుడిగా గొల్లకోటి

విజయనగరం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత నగర అధ్యక్షుడిగా గొల్లకోటి శివను ఎంపిక చేశారు. సుదీర్ఘకాలం పాటు శివ, ఆయన సోదరుడు గొల్లకోటి గురునాథ్‌లు పార్టీకి అందించిన సేవలు నేపథ్యంలో శివకు ఈ అవకాశం దక్కింది. గతంలో ఆయన నగర ప్రధాన కమిటీలో బాధ్యతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యే అదితి గజపతి రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్.కోట మైదానాన్ని బాగు చేసేందుకు తీర్మానం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదానాన్ని బాగుచేసేందుకు తీర్మానం చేశామని ఎస్.కోట యువకులు తెలిపారు. ఆదివారం స్థానిక క్రీడా మైదానం వద్ద వందలాది యువకులు సమావేశం అయ్యారు. కొద్ది సంవత్సరాల కిందట వరకు ఎంతో చక్కగా ఉన్న మైదానం ఇప్పుడు ఎవరికీ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఈ తరుణంలో మైదానాన్ని ఉపయోగకరంగా మార్చాలని తీర్మానం చేశారు. తమ సొంత డబ్బులతో పాటు దాతలు, రాజకీయ ప్రతినిధుల సహకారంతో పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. వీరికి స్థానిక పెద్దలు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ పార్కుకు సందర్శకుల తాకిడి

సీతంపేట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ప్రధానంగా పార్కులో ఉన్న సాహసోపేతమైన క్రీడల్లో చిన్నారులు పాల్గొని సందడి చేశారు. షూటింగ్, వాల్ క్లయింబింగ్, బోటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జి, 5డీ థియేటర్‌లో ఉల్లాసంగా గడిపారు. ఫోటోషూట్ కోసం యువత ఎగబడ్డారు.

590 జీవోను ఉపసంహరించుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించాలని ప్రభుత్వం తీసుకువచ్చిన 590 జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బి.పాపారావు డిమాండ్ చేశారు. కొండగుంపాంలో ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలకు రూ.70వేల కోట్లు విలువచేసే భూములను కేటాయించిందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం అంటే పేద విద్యార్థులను మెడిసిన్ విద్యకు దూరం చేయడమేనని అన్నారు. అయినా కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించవలసిందన్నారు. ఈ కార్యక్రమంలో చవితినాయుడు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సీతానగరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఈనెల 16వ తేదీన జరగనున్న ఏపీ రైతు సంఘం జిల్లా మూడవ మహాసభలను రైతులు, రైతు సంఘం నాయకులు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం కాశీపేటలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైతు సంఘం ప్రతినిధులకు పోరాట పటిమ ఉందని గుర్తు చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి సిరికి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా మండల నాయకులు తేలు ధనుంజయ్, పకీరునాయుడు, పి.విశ్వనాథం, రెడ్డి సత్యనారాయణ, జీవీ రమణ, బి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కబ్జా తగదంటూ నిరసన



నిరసన తెలియజేస్తున్న కొత్త ధర్మపురి ప్రజలు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని కొత్త ధర్మపురిలో సుమారు వందేళ్లగా తమ పూర్వీకుల నుంచి వినియోగంలో ఉన్న శ్మశాన వాటిక భూమిని కబ్జా చేయడం తగదని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పెద్దలు గేదెల అచ్యుతరావు, శంకరరావు, నారాయణరావులు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి నేటి వరకూ వినియోగిస్తున్న శ్మశానవాటికను కొంతమంది వ్యక్తులు సొంత ప్రయోజనాల కోసం ఆక్రమించడం మానవతా విలువలకు విరుద్ధమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికకు వినియోగిస్తున్న స్థలాన్ని యధాస్థితిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదం జరిగితే గానీ స్పందించరా?



ఇంటిని ఆనుకుని ఉన్న స్తంభాన్ని చూపిస్తున్న కుటుంబసభ్యులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబం కరెంటు షాక్‌తో చనిపోతే కానీ సంబంధిత శాఖ ఇక్కడ విద్యుత్ స్తంభాన్ని తొలగించదేమో అని పెదఖండేపల్లి బీసీ కాలనీకి చెందిన కొట్యాడ శంకర్ కుటుంబం ఆవేదన వ్యక్తంచేసింది. ఈ విషయంపై శుక్రవారం వారు మాట్లాడుతూ తాము ఇళ్లు కట్టిన తర్వాత తాము వద్దన్నా తమ ఇంటిని ఆనుకుని స్తంభం వేశారని తెలిపారు. ఏమాత్రం వర్షం పడినా ఇంటికి విద్యుత్ సరఫరా అవుతోందని, షాక్ కొడుతుందేమోనని భయం వేస్తుందన్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు గ్రామంలో గ్రామసభల్లో, సంబంధిత శాఖ మండల అధికారులకు ఏళ్ల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా స్పందన లేదన్నారు. ఈ ఇబ్బంది తొలగించాలని వేడుకుంటున్నారు.

నత్తల నివారణ కోరుతూ పూజలు



ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న కూరాకుల కులస్థులు

చీపురుపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్న నత్తల్ని నివారించాలని కోరుతూ పట్టణానికి చెందిన కూరాకుల కుటుంబాలు ఆదివారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. విజయనగరం జిల్లాతో బాటు పలు ప్రాంతాల్లో నత్తల గుంపు ఇటీవల పంటలకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. ఈ క్రమంలో చీపురుపల్లికి చెందిన పలు కూరాకుల కుటుంబాలు నత్తల వల్ల తమ పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లరాదని కోరుతూ అమ్మవారికి వారాల సంబరాలు నిర్వహించారు. కూరాకుల వీధికి చెందిన వందలాది కుటుంబాలు అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నత్తల నుంచి తమ పంటలకు రక్షణ కల్పించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది కూరాకుల కులస్థులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

జిందాల్ భూముల్లో జపాన్ సంస్థ ప్రతినిధుల పర్యటన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న యాకోహోమా బృందం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ భూములను జపాన్‌కు చెందిన యాకోహోమా అనే టైర్ల తయారీ సంస్థ ప్రతినిధులు పర్యటించారు. ఆదివారం మధ్యాహ్నం ఈ సంస్థకు చెందిన ప్రతినిధులు జిందాల్ కార్యాలయం వద్ద భూములు పరిశీలించిన అనంతరం మ్యాప్ పాయింట్ ద్వారా పలు అంశాలు చర్చించారు. ఈ విషయంపై వారిని ప్రశ్నించగా.. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి అనువైన స్థలాలు చూస్తున్నామని, ఇందులో భాగంగా ఈ భూములు పరిశీలించామని తెలిపారు. సుమారు 50 ఎకరాలను పరిశీలించినట్టు చెప్పారు.

జిల్లా సాధనకు చొరవ చూపండి

పాలకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకొండను జిల్లా సాధనకు అందరూ చొరవ చూపాలని తూర్పుకాపు సంఘం పాలకొండ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలో బసవ పున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించిన తూర్పుకాపు సంఘం జాతీయ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన్యం జిల్లాలో పాలకొండ నియోజకవర్గాన్ని అప్రజాస్వామికంగా విభజించారన్నారు. దీనితో తూర్పు కాపులకు భవిష్యత్తులో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కాపులంతా ఏకతాటిపైకి నడిచి జిల్లా సాధనకు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో పాలకొండని నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలోనైనా కలిపేలా చొరవ చూపాలని విన్నవించారు.

జిందాల్ నిర్వాసితుల రిలే దీక్ష



రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన రైతుసంఘాల నాయకులను పోలీసులు అవమానించడం సిగ్గుమాలిన చర్య అని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. ఆదివారం బొడ్డవర గ్రామం వద్ద జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులను పరామర్శించడానికి వచ్చిన రైతు సంఘాల నాయకులను, ప్రజా సంఘాలను, వారికి మద్దతుగా వచ్చిన వారిని పోలీసులు ఉగ్రవాదులుగా చూస్తున్నారన్నారు.

తాగునీటికి అవస్థలు

● కుళాయిల నుంచి చిన్న ధార వస్తున్నవైనం



పైపు నుంచి సన్నని ధార వస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరవాసులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. తోటపాలెంలోని బాలాజీనగర్ నాలుగవ లైన్‌లో తాగునీరు సక్రమంగా రాక స్థానికులు గత కొన్నిరోజులుగా ఇబ్బందులకు గురవుతున్నారు. కుళాయిల ద్వారా నీటిధార చిన్నదిగా రావడంతో ఒక్క బిందె నిండేసరికి చాలా సమయం పడుతుందని, ఈలోగా కుళాయిలు ఆపివేస్తున్నారని స్థానిక మహిళలు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత కార్పొరేటర్‌కు, అధికారులకు విన్నవించుకున్నా చర్యలు శూన్యమని వారు వాపోయారు. సంబంధిత అధికారులు చొరవ చూపి నీటిధారను పెంచే విధంగా పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

● హత్య కేసుగా నమోదు

కొత్తవలస, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో గాయపడిన వ్యక్తి మృతిచెందడంతో హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్పు చేసినట్టు సీఐ షణ్ముఖరావు ఆదివారం తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస మంగళ వీధిలో నివాసం ఉంటున్న జంగంపల్లి ప్రసాద్, సూరిశెట్టి రవితేజ అనే ఇద్దరు స్నేహితులు ఈనెల 7వ తేదీన మద్యం తాగారు. మద్యం మత్తులో రవితేజ.. ప్రసాద్ జేబులో చేయి పెట్టి 100 రూపాయలను తీసుకున్నాడు. ఆ డబ్బులతో రవితేజ చికెన్ కొనుక్కుని ఇంటికి పట్టుకుపోయాడు. ఆ చికెన్ కోసం ప్రసాద్.. రవితేజ ఇంటికి వెళ్లి తిరిగి తెచ్చుకున్నాడు. మద్యం మత్తులోనున్న రవితేజ ఆగ్రహంతో ఊగిపోయి ప్రసాద్ ఇంటికి వెళ్లి, కూరగాయలు కోసుకునే చాకుతో పలు చోట్ల గాయపర్చాడు. దీంతో గాయపడిన ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు బాధితుడి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూరిశెట్టి రవితేజపై పోలీసులు హత్యాహత్య యత్నం కేసునమోదు చేశారు. శుక్రవారం అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పర్చారు. 14 రోజులపాటు జుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. శనివారం సాయంత్రం చికిత్స పొందుతున్న ప్రసాద్ మృతిచెందాడు. దీంతో హత్యా యత్నం కేసును హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సహజీవనంలో విభేదాలతో యువతి ఆత్మహత్య

● విశాఖలో ఘటన

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ సింహాద్రిపురంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. సహజీవనంలో విభేదాల కారణంగా ఆమె ఉరేసుకుని మృతిచెందినట్లు తండ్రి పూడి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా మెంటాడ మండలం పెదమేడపల్లి ప్రాంతానికి చెందిన పూడి లిఖిత(20) ఇంటర్మీడియట్ పూర్తి చేసి, నర్సింగ్ కోర్సు చేయడానికి విశాఖకు ఈ ఏడాది ఏప్రిల్‌లో వచ్చింది. ఆమె పెదచామలాపల్లి ప్రాంతానికి చెందిన రాయి నాగరాజుతో సింహాద్రిపురంలో సహజీవనం చేస్తోంది. నర్సింగ్ కోర్సు కూడా మానేసింది. సహజీవనంలో తరచూ వీరిద్దరూ గొడవపడేవారు. ఈనెల 10న నాగరాజు లిఖితతో గొడవపడి, బయటకు వెళ్లిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన లిఖిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం శనివారం బయటపడటంతో యువతి తండ్రి వెంకటరమణ ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సహజీవనం చేసిన రాయి నాగరాజు ప్రోద్బలం వల్లనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.

భార్య మందలించిందని మనస్తాపంతో ఒకరు..

ఎస్.కోట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని తలారీ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై సీఐ నారాయణమూర్తి ఆదివారం సాయంత్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చలపురెడ్డి కృష్ణ(45) కొద్ది కాలంగా మద్యం తాగడంతోపాటు డబ్బులు వృథా చేస్తున్నాడు. దీంతో భార్య పైడితల్లమ్మ ఈనెల 1వ తేదీన మందలించింది. అయితే అదేరోజు రాత్రి బయటకు వెళ్లిన కృష్ణ కాసేపటి తర్వాత ఇంటికి వచ్చి పడిపోయాడు. ఆ సమయంలో అతని పక్కన గడ్డి మందు డబ్బా ఉండడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖపట్నం లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

కొమరాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కుమ్మరిగుంట గ్రామానికి చెందిన యలగల పరిశినాయుడు (25) ఆదివారం రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. మార్కొండపుట్టి గ్రామానికి మిత్రులను కలవడానికి వెళుతుండగా విక్రంపురం సమీపంలో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న తల్లి కన్నీరుమున్నీరైంది. జీఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు సోదరుడు 2007లో ఓ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందాడు. 2014లో అనారోగ్యంతో తండ్రి మృతి చెందారు. పరిశినాయుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. ఇంతలో కొడుకు రైలు ఢీకొని మృతి చెందడంతో తల్లి రోదనతో స్థానికులు కంటతడి పెట్టారు.

బంగారం చోరీ

గంట్యాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం పంచాయతీ పరిధిలో గల జగదాంబనగర్‌లో నివాసం ఉంటున్న కుప్పిలి శ్రీరాంమూర్తి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి తులం ముప్పావు బంగారాన్ని చోరీ చేసినట్టు ఎస్ఐ సాయికృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరాంమూర్తి ఇంటిలో లేని సమయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం తీసి, లోపలికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసు, పావు తులం బంగారు ఉంగరాన్ని కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణరావు, చోడి ఆదినారాయణ, ఇప్పిలి రామారావులు కోరారు. ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బలహీనవర్గాలకు, పేదలకు కేటాయించిన ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయని రోడ్లు, డ్రైనేజీ కాలువల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే తాగునీరు, సాగునీరు విద్య, వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు గణేష్, శ్రీను, మలిచర్ల గణేష్, తారకేశ్వరరావు, పార్వతీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ సేవలు అభినందనీయం

విజయనగరం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో ఇంజనీరింగ్ శాఖ సేవలు అభినందనీయమని పీఆర్ ఇంజనీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ఇంజనీరింగ్ శాఖ పాత్ర మరింత బలోపేతం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సంఘ సభ్యులు గంట స్తంభం మెమెంటోను అసోసియేషన్ కార్యదర్శికి ప్రదానం చేశారు. కోశాధికారి నీరజ, గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ ముమ్మరం చేయాలని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గుడివాడ ప్రభాకరరావు సూచించారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామాల మహిళా యువజన సంఘాలు, పంచాయతీ ప్రతినిధులు, హెల్త్ వర్కర్లు సంయుక్తంగా పనులు చేపడితే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. అనారోగ్యానికి గురైతే సమీపంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మెరకముడిదాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గర్భాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయంగా అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు పల్లేడ స్వామినాయుడు, సావు శంకరరావు, పల్లి మురళీకృష్ణల ఆధ్వర్యంలో వారంతా కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు ఎనిమిది మందిని సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

పసిడి పైపైకి!

(ఐదో పేజీ తరువాయి)

హాల్‌మార్కు బయటపడకుండా ఉండేందుకు నెట్‌లో ఉన్న వేరేవారి హెచ్‌యూఐడీ నంబర్లు వేస్తున్నట్టు తెలుస్తోంది. సాధారణంగా హెచ్‌యూఐడీ నంబర్లను గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఇట్టే వివరాలు తెలిసిపోతాయి. అందుకే వేరేవారి హెచ్‌యూఐడీ నంబర్లను వేసి నకిలీ హాల్‌మార్కుతో బురిడీ కొట్టిస్తున్నారు. అయితే ఒకవైపు ధర పెరుగుదల, మరోవైపు మోసాలు వెలుగుచూస్తుండడంతో సామాన్యులు వన్‌గ్రామ్ గోల్డ్ వైపు అడుగులు వేస్తున్నారు. అచ్చం బంగారం మాదిరిగా ఆభరణాలు ఉండడం, వాటి విషయంలో ఎటువంటి భయాలు లేకపోవడంతో సామాన్యులు, మధ్యతరగతి వారు ఎక్కువగా వన్‌గ్రామ్ గోల్డ్ వైపే మొగ్గుచూపుతున్నారు. మొత్తానికైతే బంగారం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి.

అమ్మకాలు తగ్గాయి..

ధరలు పెరుగుతున్న నేపథ్యంలో అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. పెళ్లిళ్ల సీజన్ అయినాసరే అంతగా అమ్మకాలు లేవు. ధర తగ్గుతుందన్న ఆశ కొనుగోలుదారుల్లో ఉంది. ధర తక్కువగా ఉన్న సమయంలో అమ్మకాలు గణనీయంగా ఉండేవి.

-కొత్తా మధుసూదనరావు, బంగారు ఆభరణాల వ్యాపారి, రాజాం

ట్రయల్ రన్‌తో సరి!

(ఐదో పేజీ తరువాయి)

రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మార్గం పూర్తిగా పాడైపోయిన నేపథ్యంలో రైల్వే ప్రయాణం సురక్షితం, ప్రత్యామ్నాయంగా భావిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో రైల్వే సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. ఇటీవల దుర్గ్ నుంచి విశాఖకు వందేభారత్ రైలును ఏర్పాటు చేశారు. ఆ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ లేకపోయింది. కాగా కొత్తగా ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ ఇచ్చారు. ఇది కాసంత ఊరటే. బొబ్బిలి నుంచి విశాఖ లేదా విజయనగరానికి షటిల్ రైలు సర్వీసులు ప్రవేశ పెట్టాలని, బొబ్బిలి-నుంచి సాలూరుకు గతంలో మాదిరిగా రైలు బస్సు నడపాలని ఈ ప్రాంత ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

రైలు ప్రయాణికుల కష్టాలు తీరేదెప్పుడు

బొబ్బిలి ప్రాంతం నుంచి రైళ్లలో ప్రయాణించే వారి కష్టాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. సామాన్య ప్రయాణీకులకు ఎంతగానో ఉపయోగపడే విధంగా జనరల్ బోగీలను రైళ్లలో పెంచడం లేదు. బొబ్బిలి-సాలూరు మధ్య ఆగిపోయిన రైలు సర్వీసును ఎందుకు పునరుద్ధరించడం లేదో అర్థం కావడం లేదు. బొబ్బిలి , సాలూరును కలుపుతూ విశాఖ వరకు గతంలో ప్రకటించిన మాదిరిగా షటిల్ రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలి.

-పి.శంకరరావు, బొబ్బిలి

మా లాంటి వారికి ఎంతో ఉపయోగం..

బొబ్బిలి-సాలూరు పట్టణాల మధ్య రైలు నడిస్తే మాలాంటి చిరు వ్యాపారులకే కాకుండా రైతులకు, కూలీలకు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చాలా ఉపయోగంగా ఉంటుంది. ట్రాఫిక్ సమస్యను అధిగమించి తక్కువ ఖర్చుతో రాకపోకలు సాగించడానికి వీలుంటుంది. ఎంతోమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

-రమేష్, చిరువ్యాపారి, బొబ్బిలి

ఎక్కడికక్కడే మోసం

(ఐదో పేజీ తరువాయి)

ఊరు దాటారని తెలిశాక ఒక్కొక్కటిగా తెరుచుకుంటున్నాయి. వంట నూనెల్లో తూకవ మోసాన్ని ఎవరూ పట్టుకోలేకపోతున్నారు. వంట నూనె కల్తీ చేసి విక్రయిస్తున్నా చర్యలు కనిపించడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారులు శాంపిల్ సేకరణ వరకే పరిమితమవుతు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నివేదికను రహస్యంగా ఉంచుతున్నారు.

● బియ్యం, పప్పులు, మసాల దినుసులు ఇలా ప్రతిదీ నాసిరకం సరుకులు కట్టబెడుతున్నారు. మొదటి రకం సరుకులని చెబుతూ మూడో రకం ఇస్తున్నారు. చాలా మంది ప్రజలకు సరుకుల్లో వున్న నాణ్యత తెలియక వ్యాపారులు చెప్పిన వాటిని నమ్ముతున్నారు.

రాష్ట్రంలో ల్యాబ్‌లు లేక..

వినియోగదారులు కొనుగోలు చేసే సరుకులు విక్రయిస్తున్న ప్రతి దుకాణం, మాల్‌ను తూనికలు, కొలతల శాఖతో పాటు ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీ చేయాలి. తూకంలో మోసం చేసినా, నాణ్యమైన సరుకులు విక్రయించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అయితే ఈ రెండు శాఖలకు జిల్లా స్థాయి అధికారులు మాత్రమే ఉంటున్నారు. సిబ్బంది లేకపోవడంతో పూర్తిస్థాయి తనిఖీలు ఉండడం లేదు. దీనికి తోడు సరుకుల నాణ్యత గుర్తించేందుకు రాష్ట్రంలో ఎక్కడా ల్యాబ్‌లు లేవు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న ల్యాబ్‌కు పంపంచాలి. ఇదంతా శ్రమ, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు శాంపిల్ సేకరణకు బద్ధకిస్తున్నారు. హెచ్చరికలతో సరిపెడుతున్నారు. ఇదే వ్యాపారులకు కలిసి వస్తోంది.

నిబంధనలు ఇలా..

తిని, తాగే ప్రతి ఆహారం విక్రయించే దుకాణ యమానులు భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ధ్రువపత్రం కలిగివుండాలి. దీనికి సంబంధించి భారత ప్రభుత్వం 2006 సెప్టెంబర్ 5న చట్టం తీసుకొచ్చింది. హోల్‌సేల్, రిటైల్‌గా పెద్దపెద్ద కిరాణా, వంట నూనె వ్యాపారం చేసే యజమానులు చాలా మంది వీటిని పొందడం లేదు. కొంత మంది గడువు ముగిసిన తరువాత రెన్యూవల్ చేసుకోవడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు తూనికలు, కొలతల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తే వినియోగదారులు మోసాలకు గురికాకుండా ఉండడంతో పాటు ప్రజారోగ్యం కాపాడినవారవుతారు.

టీబీ లక్షణాలతో వివాహిత మృతి?

● పెదశెలగాంలో గిరిజనుల ఆందోళన

రామభద్రపురం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): పెదశెలగాం గిరిజన గ్రామంలో శనివారం తెల్లవారుజామున టీబీ లక్షణాలతో ఓ వివాహిత మృతి చెందింది. కొన్ని రోజులుగా ఆమె టీబీ మందులు వాడుతున్నట్టు తెలిసింది. స్థానికంగా టీబీ వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతుండటంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో 150 మంది వరకు గిరిజనులు నివసిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న బావి నీరు తాగడం వల్లే టీబీ సోకుతోందని గిరిజనులు భావిస్తున్నారు. చెత్తాచెదారంతో బావి నీరు కలుషితమవుతోందని, పెదశెలగాంలో పశువులు, మేకల సంచారం అధికంగా ఉండటం వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతోందని వారంటున్నారు. దానివల్లే రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామంలో 10 మందికి పైబడి టీబీ రోగులు ఉన్నారని అదే గ్రామానికి చెందిన కె.చిన్నపుదొర తెలిపారు. గ్రామంలో టీబీ వ్యాధిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని స్థానికుడు రామన్న దొర డిమాండ్ చేశారు.

కేసులు ఉన్నాయి..

పెదశెలగాంలో టీబీలు కేసులు ఉన్నమాట వాస్తవమేనని ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అపర్ణ తెలిపారు. టీబీ లక్షణాలు గలవారిని ఆశావర్కర్ల సాయంతో ఎప్పటికప్పుడు గుర్తించి పరీక్ష చేస్తున్నామన్నారు. టీబీ ఉన్నవారికి మందులు అందజేస్తున్నామన్నారు. టీబీ రోగులకు చేరువలో ఉన్న వారి ఇళ్లల్లోని వారినీ పరీక్షిస్తున్నామన్నారు. కొన్ని కేసులను విజయనగరం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నామని చెప్పారు.



పెదశెలగాం గ్రామస్థులు తాగేది ఈ బావి నీటినే..

కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడిగా 'గెంబలి'

బొబ్బిలి అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కళింగవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా గెంబలి శ్రీనివాసరావు మళ్లీ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కళింగ వైశ్య భవనంలో బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో గెంబలి ఎన్నిక ఖరారైంది. అధ్యక్ష పదవి కోసం సంఘం మాజీ అధ్యక్షులు కింతలి శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్‌తో పాటు నారంశెట్టి మున్నా పోటీ డ్డారు. చివరకు అధ్యక్షుడిగా గెంబలి, ఉపాధ్యక్షుడిగా బరాటం గిరి, కార్యదర్శిగా కింతలి నాని, కోశాధికారిగా కెంగువ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా, ఆరోవార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం అభివృద్ధికి పునరంకితం అవుతానన్నారు.



గెంబలిని అభినందిస్తున్న సంఘం నాయకులు

కార్మికుడికి సత్కారం

బొబ్బిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా స్థాయి స్వచ్ఛ వారియర్ అవార్డును అందుకున్న బంగారి నాగరాజును ఆదివారం సాయంత్రం కారుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ జేసీ రాజు మాట్లాడుతూ బొబ్బిలికి అనేక అవార్డులు దక్కేందుకు పారిశుధ్య కార్మికుల శ్రమ, కృషి ఎంతో ఉందన్నారు. అలాంటి కార్మికులను మనం సముచితంగా గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కారుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు చిన్నారావు, జీసీహెచ్‌జీ శర్మ, సోమేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల మలుపుతో భయం.. భయం

రామభద్రపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజాం రోడ్డులోని మర్రివలస వద్ద ఉన్న మలుపు ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రదానంగా ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ రాజధానిగా ఉండటంతో ఒడిశా వాహనాలు అధికంగా ఈ రోడ్డు మీదుగా ప్రయాణిస్తుంటాయి. ఇక్కడి మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంలేదు. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపులో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



మర్రివలస వద్ద రహదారి మలుపు

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

బాడంగి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మంత్రి మండలి భేటీలో పలు అంశాలను ఆమోదించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజ్‌లకు ఎంపీడీవోల సంఘం జిల్లా నాయకుడు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ విధానాన్ని రద్దుచేసి 13,351 పంచాయతీలను స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా మంత్రి మండలి భేటీలో పరిగణించారన్నారు. అలాగే కమిటీ సిఫార్సు మేరకు 13,351 పంచాయతీలను రుర్బన్ పంచాయతీ, గ్రేడ్-1, 2, 3 గా పునర్ వ్యవస్థీకరణ చేశారన్నారు. 359 గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీ పోస్టులను రుర్బన్ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులుగా డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కేడర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న తదితరుల మార్పులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు.

గ్రంథాలయాలపై ఆసక్తి పెంచుకోండి

గరుగుబిల్లి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు సూచించారు. ఆది వారం శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. సెలవు దినాల్లో సమయం వృథా చేకుండా పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు.

జీఎస్టీ తగ్గింపు బీజేపీ మార్కు మోసం

బొబ్బిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్ను తగ్గింపునకు సంబంధించి దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రచారం బీజేపీ మార్కు మోసం అని సీపీఎం నాయకులు పి.శంకరరావు, శేషగిరిరావు విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎనిమిదేళ్ల పాటు దేశ ప్రజల నుంచి రూ.30 లక్షల కోట్లను బీజేపీ పీల్చిపిప్పి చేసిందని ఆరోపించారు. క్యాన్సర్, గుండెజబ్బుల కోసం వాడే మందులపై 24 శాతం పన్నులు వసూలు చేశారన్నారు. చిన్నపిల్లలు వినియోగించే పెన్సిళ్లను సైతం విడిచిపెట్టకుండా పన్ను విధించారన్నారు. ఒకే దేశం, ఒకే పన్ను అంటూ బీజేపీ చేసిన ఆర్భాటంపై జనం నిప్పులు చెరుగుతున్నారన్నారు. ఇకనైనా ప్రజలకు నష్టం కలగని రీతిలో పాలన సాగించాలని డిమాండ్ చేశారు.

కోటిచెరువు ఆవరణలో మొక్కలు

బొబ్బిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటి చెరువు ఆవరణలో ఆదివారం గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీరమణ మూ ర్తి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆంజ నేయస్వామి ఆలయ చైర్మన్ కింతలి బంగార్రాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో శశిభూషణ రావు, మరడాన వెంకటనాయుడు పాల్గొన్నారు.

మురుగునీరు పోయే దారేది ?



దిబ్బగుడ్డివలసలో రోడ్డుపై మురుగునీరు ఇలా..

బొబ్బిలి రూరల్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలస సచివాలయం వీధిలో మురుగునీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలో వాడుక నీరంతా రహదారిపై చేరుతోంది. సమీపంలోనే సచివాలయం, పాఠశాల ఉన్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు. బొబ్బిలి నుంచి శంబర వెళ్లే రహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి నిలిచిన మురుగునీటి వల్ల వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. ● ఈ విషయంపై సచివాలయం కార్యదర్శి పార్వతిని వివరణ కోరగా త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

బాడంగి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో సూచించారు. పనుల కల్పన, నిర్వహణ రాబోయే రోజుల్లో మరింత పారదర్శకత అవకాశం ఉంటుందన్నారు. పనుల్లో నాణ్యత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధిలో చిన్నపాటి లోపాలను నిరోధించేందుకు వేతనదారులు అందరూ సహకరించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

లోకేశ్‌ను కలిసిన విజయచంద్ర



పార్వతీపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు ఆదివారం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర కలిశారు. మర్యాదపూర్వ కంగా కలిశారు. యువతకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు.

లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం నుంచి కలె క్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్టు విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, కె.సోమేశ్. బి.రవికుమార్, పి.సంగం తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. రక్షితనీరు, పౌష్టికా హారం అందించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు.

అండర్ టన్నెల్‌కు మరమ్మతులు

పాలకొండ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏలాం జంక్షన్ వద్ద తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ నుంచి వడమ గ్రామానికి వెళ్లే అండర్ టన్నెల్‌కు పడిన రంధ్రాన్ని స్థానిక వ్యాపారులు ఆది వారం పూడ్చారు. అండర్ టన్నెల్‌కు చాన్నాళ్ల కిందట రంధ్రం పడింది. దీనితో ప్రధాన రహదారిపై నీరు ప్రవహిస్తుండటంతో ఏ లాం జంక్షన్‌లో రహదారి పాడైంది. ప్రయాణికులు, వాహనచోదకు లకు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు స్థానికులు విన్నవించినా ఫలితం లేకుంది. దాంతో స్థానిక వ్యాపా రుల స్పందించారు. సొంత నిధులను వెచ్చించి అండర్ టన్నెల్ రంధ్రానికి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమం వ్యాపారు లు కె.ఎస్.రావు తదితరుల పర్యవేక్షణలో జరిగింది.

ఏజెన్సీలో వైద్య సేవలు అందించండి

కొమరాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజనుల పిల్లలకు సరైన వైద్యసేవలు అందించాలని సీపీఎం పార్టీ నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గు రైన పిల్లలను ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ హెల్త్ క్లినిక్‌కు తీసుకువచ్చిన నేపథ్యంలో వారితో సాంబమూర్తి మాట్లాడారు. నయా పంచా యతీ వాటికకోసు గ్రామానికి చెందిన దాయమ్మకు చెందిన ఐదేళ్ల కుమార్తె ముఖంపై కురుపులతో బాధ పడుతోందన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన గరికమ్మకు చెందిన ఐదేళ్ల కుమారుడు అఖిల్ రెండు రోజులుగా జ్వరంతో బాధప డుతు న్నట్టు చెప్పారన్నారు. గిరిజన గ్రామాల్లో సరైన వైద్య సేవ లు అందించిన ఫలితంగా వారు ఎంతో వ్యయ ప్రయాసలతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్ర యిస్తున్నారన్నారు. ఇకనైనావైద్య సేవలను ముమ్మ రం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీరఘట్టం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యు.వెంకం పేట గ్రామానికి చెందిన మునగపాక తవుడుకు సీఎం సహాయనిధి నుంచి రూ.80,300 మంజూరైంది. ఆదివారం వీరఘట్టంలోని నివాసంలో ఆ మొత్తానికి సంబంధించిన చెక్కు ను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఉదయాన ఉదయ్ బాస్కర్, చింతా ఉమ, అలజంగి కృష్ణ, నివర్తి శశి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. నిరుపయోగంగా



నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించేందుకు గతంలో మంజూరు చేసిన ఈ ఆటో మరమ్మతులకు గురైంది. నిర్వహణ లేక మూలకు చేరింది. దీంతో చెత్త తరలింపు ఆగిపోయింది. రూ. లక్షలు వెచ్చించిన వాహనం నిర్వహణ సక్రమంగా లేక మరమ్మతులకు గురైంది. అధికారులు పట్టించుకోక పోవడంతో తుప్పు పట్టింది. బ్యాటరీ పాడవడంతో ఆటో పనిచేయడం లేదని నిర్వాహకుడు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో రవికుమార్ వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.